
# తమ్ముకాని తమ్ము

పోల్కంపల్లి శాంతాదేవి



''రేపే రఘును పెళ్ళికొడుకుని చేసే రోజు! బంధువులంతా వస్తారు. ఇంట్లో మీ అమ్మగారి పర్మిషన్ తీసుకొని మా ఇంటికి వచ్చెయ్యి! నువ్వు చేయాల్సిన పని అంతా వచ్చిన బంధువులకు టీలు, టిఫిన్లు సక్రమంగా అందుతున్నాయో లేదో కనుక్కోవడం మాత్రమే!'' అని చెప్పాడు డాక్టర్ చంద్రశేఖర్, నర్స్ రాజ్యలక్ష్మితో.

ఇదివరలో రాజ్యలక్ష్మి ఎందుకో ఒకటిరెండుసార్లు వాళ్ళఇంటికి వెళ్ళినా ఇంటివాళ్ళతో పరిచయంచేసుకోకుండానే వచ్చేసింది. డాక్టరుగారి భార్య చదువుకొన్నది. కొన్నాళ్ళు ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉండి విరమించుకుంది. ప్రస్తుతం క్లబ్ ప్రెసిడెంట్, మహిళా మండలి ప్రెసిడెంటూ, ఇంకా ఏవో సంఘాలకి మెంబరూ. తెల్లగా, బొద్దుగా ఉంటుంది.

వాళ్ళ పెద్దబ్బాయి ప్రవీణ్‌కుమార్ డాక్టరేట్ తీసుకొని ఈమధ్యే స్టేట్స్ నుండి దిగాడట. అతడు వివాహానికి విముఖుడు కావడంవల్ల రెండో అబ్బాయి రఘువీర్‌కు వచ్చిన సంబంధం ఖాయం చేశారట. డాక్టరుగారి తమ్ముళ్ళు, మరదులూ అంతా విద్యాధికులు. ఆర్థికంగా పైఅంతస్తువాళ్ళు. వాళ్ళమధ్య తనొక బాధ్యత నిర్వహించడమన్నది భయంగా తోచింది రాజ్యలక్ష్మికి. మంచి బట్టలు లేవు. నగలు లేవు. నలుగురిలో చాకచక్యంగా తిరిగి చలాకిపిల్ల అనిపించుకొనే నేర్పు లేదు. తండ్రిపోయి ఒక కుటుంబ భారాన్ని మోస్తున్న ఒక పేద నర్సు. వాళ్ళమధ్య తనకు ఎలాంటి గౌరవం జరుగుతుందో తనకు తెలుసు. కాని, ఉద్యోగమిచ్చినవాడు ఏ ఆజ్ఞ యిచ్చినా అది నెరవేర్చక తప్పదు.

వెళ్ళక తప్పదనుకొన్న రాజ్యలక్ష్మి మరునాడు స్నానంచేసి తనకున్న వాటిలో మంచి చీర కట్టుకొని బయల్దేరింది.

* * *

అధునాతనంగా కట్టబడిన రెండంతస్తుల పింక్‌కలర్ మేడ. ముందు కొబ్బరి ఆకులతో కట్టబడిన పెళ్ళిపందిరి. చేసే వాళ్ళతో, చేయించేవాళ్ళతో సందడిగా ఉంది ఆ ప్రదేశమంతా.

''ఓ! రాజ్యలక్ష్మీ! వచ్చేశావన్నమాట గుడ్. యిలా రా!'' అని, చంద్రశేఖర్ భార్యఉన్నచోటికి తీసుకుపోయి రాజ్యలక్ష్మిని పరిచయంచేసి, ఆ పిల్లకు ఏదైనా పని అప్పగించమని చెప్పి పనితొందరలో అవతలికి వెళ్ళిపోయాడు.

డాక్టరుగారి భార్య నేరుగా ఫలహారాల గదిలోకి తీసుకుపోయింది రాజ్యలక్ష్మిని. కమ్మటి వాసనతో ఘుమాయిస్తున్నది గది. "చూడమ్మా! తిననివాళ్ళకి, తిన్నవాళ్ళకి పెట్టేయడంకాక తిననివాళ్ళెవరో కనుక్కుని పెట్టు. పదార్థం వేస్ట్‌కాకుండా చూడు. ఇదిగో, నీ చేతిక్రిందికో పిల్లను కూడా ఇస్తున్నాను!'' అని, కమల అనే పిల్లను పిలిచి, రాజ్యలక్ష్మికి అప్పజెప్పి అవతల పనిచూసుకోడానికి వెళ్లిపోయింది హడావుడిగా.

ఫలహారాల బుట్ల మధ్య ఓ ఎత్తుపీట చూచుకొని కూర్చుండిపోయింది రాజ్యలక్ష్మి. గంట గడిచిపోయింది. ఆకుల్లో, ప్లేట్లలో ఫలహారాలు సర్దిసర్ది రాజ్యలక్ష్మి చేతులు లాగడం మొదలుపెట్టాయి. శ్రమను సూచిస్తూ ముఖంలో అందంగా స్వేదం అలుముకొంది.

"టూ ప్లేట్స్ ప్లీజ్!" గుమ్మం అవతల జరీఅంచు ధోవతిలో ఆకర్షణీయంగా ఉన్న యువకుడు నిలబడి మృదువుగా అడిగాడు.

రాజ్యలక్ష్మి చేతిక్రిందపిల్ల ఎప్పుడో మాయమైపోయింది. తనే లేచి మూలకి ఉన్న ప్లేట్లు రెండు తీసుకొని ఫలహారాలు సర్దసాగింది.

"లడ్లు రెండు రెండు వేయండి. నా ఫ్రెండ్సు కొంచెం భోజనప్రియులు. చాలు, చాలు! ఉప్మా అక్కరలేదు."

రెండుచేతుల్లో రెండుతీసుకొని అతడిని సమీపించింది రాజ్యలక్ష్మి. అతడవి అందుకొని థ్యాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

మరోగంట గడిచిపోయింది. అవతల బాజాలు మ్రోగుతున్నాయి. ఆడవాళ్ళు మగవాళ్ళు పందిట్లోకి జేరుతున్నారు. పందిట్లో కొట్నం పెడుతున్నారు.. రాజ్యలక్ష్మికి అవతల జరిగే తతంగమేదీ తెలియకుండా ఆ గదికి అంకితమైనట్టుగా కూర్చుండిపోయింది.

ఎవరో ఒకామె తొంగిచూసి, "అంతా పందిట్లో ఉంటే, నువ్విక్కడే ఉన్నావా? లే లే" అని వెళ్ళిపోయింది, పట్టుచీర బరబర చప్పుడు చేసుకుంటూ.

రాజ్యలక్ష్మి లేచింది.


"త్రీ ప్లేట్స్ ప్లీజ్!"

మరిచిపోకుండా రెండు రెండు లడ్లు ఉంచింది ప్లేట్లలో. ట్రేతో మూడింటినీ ఉంచి అతడి కిచ్చింది. అతడు వెంటనే వెళ్ళిపోలేదు. "ప్రొద్దుటినుండి 'మీరే మైనా తీసుకొన్నారా లేదా?"

"........."

రాజ్యలక్ష్మికి నిజంగా చాలా ఆకలిగా ఉంది. ప్రొద్దున్నే ఇక్కడికి వచ్చేసే తొందరలో ఇంటిదగ్గర ఏం తీసుకో లేదు, టీ తప్ప. డాక్టరుగారి సతీమణి తనకు పని అప్పగించే తొందరలో తనను తినమనికూడా చెప్పలేదు!

"మీ వాడిన ముఖమే చెబుతూంది, మీ రేమీతినలేదని! పెళ్ళిళ్ళలో ఇలా ముఖ మాటపడితే ఎండప్పే!" అంటూ, ట్రేలోని ఓ ప్లేట్ ఇవ్వబోయాడు.



"మీరు తీసుకుపొండి, నేను వేరే పెట్టుకొంటాను!" రాజ్యలక్ష్మి పెరట్లోకి వెళ్ళి చేతులు శుభ్రపరుచుకొని, ముఖం మీద చల్లటినీళ్ళు పోసుకొనివచ్చి ఫల హారంచేసింది. నీళ్ళు త్రాగి అవతలికి వెడదామనుకొనేంతలో తిరిగి అతడు వచ్చాడు. "ఆడమ్మగార్లంతా పందిట్లోనే ఉన్నారు. కాస్త మీరు శ్రమ అనుకో కుండా స్పెషల్‌గా మూడు కప్పుల కాఫీ...కాస్త నేను కూడా మీ పనిలో సాయపడతాను!" అన్నాడు.

"నాకూ్కడా ఓ కప్పుకు పర్మిషన్ ఇవ్వాలి మీరు!"

సన్నగా నవ్వాడు అతడు. స్టౌ, టీ కాఫీ సరంజామా ఉన్న గదిలోకి ఆమెను తీసుకుపోయాడు. అన్నీ చూపించి కాఫీ తయారయే వేళకు తిరిగి వచ్చాడు.

డికాక్షను నాలుగు కప్పుల్లోకి పోసి షుగర్ కలుపుతున్నది.

"మీరు..."

అతడి కుతూహలం గమనించి, "నేను డాక్టరుగారి డిస్పెన్సరీలో నర్సుగా ఉంటున్నాను...బంధువుని కాదు!" అని పరిచయం చేసుకొంది.

"ఐసీ!" కప్పులుంచిన ట్రే అందు కొని వెళ్ళిపోయాడు అతడు.

కాఫీ తాగడం ముగించి, ఓసారి చీరకుచ్చిళ్ళు సర్దుకొని, ముంగురులు వెనక్కిత్రోసుకొని పందిట్లోకి వచ్చి ముత్తయిదువుల మధ్య కూర్చుంది రాజ్యలక్ష్మి. ఆమె ప్రక్కనే నలుగురు కాలేజీ అమ్మాయిలు కూర్చుని ఉన్నారు. రచయిత్రులమీద, సినిమా హీరోలమీద దొర్లిపోతున్న సంభాషణ ఒక్కసారిగా మారిపోయింది. "చూశావా? అతడే మా చంద్రశేఖరం మామయ్య పెద్దకొడుకు, ప్రవీణ్‌కుమార్. కెమికల్ టెక్నాలజీలో డాక్టరేట్ తీసుకొని వచ్చాడు మొన్నే ఇండియాకు. ఇలా రఘుభావ పెళ్ళి ఉందని తెలిపితే వచ్చాడటగాని అక్కడే ఉద్యోగం చూసుకొని సెటిలైపోదామను కొన్నాడట. మా మామయ్య అత్తయ్యకి అతడు పారిన్‌లో సెటిల్‌కావడం ఇష్టం లేదు! మరి ఏం నిశ్చయించుకొంటాడో తెలియదు."

ఆసక్తిగా వాళ్ళు చూస్తున్న దిశకు రాజ్యలక్ష్మి చూపులు త్రిప్పింది. అక్కడ మగవాళ్ళ మధ్య ఇందాక తనతో కాఫీ చేయించుకొని తన పరిచయంచేసుకొన్న యువకుడు కనిపించాడు. ఎవరితోనో మాట్లాడుతూ నవ్వుతున్నాడు. 'మైగాడ్! డాక్టరుగారి పెద్దబ్బాయి!' చిరుచెమటలు పోశాయి రాజ్యలక్ష్మికి. ఎంత సామాన్యంగా మాట్లాడాడు తనతో! డాక్టరు గారికి దగ్గర బంధువేమో అనుకొంది.

"పెళ్ళి వద్దన్నా వెందుకో?"

''అక్కడే ఎవరినైనా ప్రేమించాడో ఏమో?"

"అందమైనదానివని నీకెంతో గర్వం గదా, మాలినీ! అతడేమైనా కదులు తాడేమో చూడు!" ప్రవీణ్ ఇటే తిరిగి చూడడంతో పమిట సర్దుకొని వంకరలు పోయింది, మాలిని అనే అమ్మాయి- రాజ్యలక్ష్మి చూపులు త్రిప్పుకుంది.

కుందెనలో రోకళ్ళు ఆడించి వరునికీ, వరుని తలిదండ్రులకి తాకిస్తున్నారు. ముత్తైదువులు ఓ ప్రక్క తిరగలిలో ఏదో పోసి పిండి విసురుతున్నారు.

భోజనా లయ్యేప్పటికి సాయంత్ర మయింది.

రాజ్యలక్ష్మి వెళ్ళిపోతున్నానని చెప్ప డానికి డాక్టరుగారి సతీమణిని వెదుకుతూ నడిచింది.

''ఎందుకురా? వస్తే ఏమౌతుంది?"

"తలనొప్పిగా ఉంది, రానమ్మా."

"తలనొప్పి అయితే తమ్ముడు పెళ్ళికి రావా?"

"పెళ్ళిచేసుకొని వచ్చాక చూడనా ఏమిటి? అయినా నన్ను అక్కడ విడ్డూ రంగా చూస్తారు. నా పెళ్ళి కాకుండా తమ్ముడిపెళ్ళి అవుతుందంటే వాళ్ళ కొక సస్పెన్స్. మీరు వదిలివేసినంత తేలికగా వాళ్ళు నన్ను వదిలివేయరు. పిల్ల నివ్వ డానికి ఎంతమంది అయినా తయారు అవుతారు! వద్దని చెప్పి నిష్ఠూరం కొని తెచ్చుకొనే బదులు నేను రాకుండా ఉండడమే మేలు.''

"ఇది మాత్రం విపరీతం కాదా యేమిటి? చదువైపోయింది, ఉద్యోగం కూడా చేయబోతున్నావ్. నీ మనసుకు నచ్చినమ్మాయిని చూసి పెళ్ళిచేసుకోక పోతే ఎన్నాళ్ళిలా ఉండిపోవాలను కొన్నావు?" డాక్టరుగారి శ్రీమతి కంఠం తీవ్రంగా వినిపించింది.

రాజ్యలక్ష్మి గది ఇవతలే ఆగి పోయింది.

అయిదు నిమిషాల తరువాత చిటపట లాడే ముఖంతో ఆవిడ ఇవతలికి వచ్చింది.

"నేను వెడుతున్నానండీ!"

''ఊళ్ళో ఇల్లు. తొందరేం? కాస్త నా పెట్టె సర్దిపెడుదూ!" రాజ్యలక్ష్మి రెక్కపట్టి మరోగదిలోకి తీసుకు పోయింది. పెళ్ళిపిల్లకు తీసుకుపోయే చీరలు, రవికలు, ఇంకా ఏవేవో సామాను ఆవిడ అందిస్తూంటే రెండు పెట్టెల్లో పొందిగ్గా సర్దింది రాజ్యలక్ష్మి. పనిలో ఇంత నేర్పుగల పిల్ల తనతో ఉండడం ఎంతో అవసరం అనుకొన్న ఆవిడ, "పెళ్ళికి రావా ఏమిటి?" అంది.

''రాలేనండీ!"

"ఎందుకు? చీరలులేవనా? నా చీరలు ఉన్నాయిగా?''

"అదికాదండీ! మా అమ్మకి జ్వరంగా ఉంది. ప్రొద్దున నేను వచ్చేటప్పుడు ఆవిడ ప్రక్కమీదే ఉంది!"

"అలాగా?" ఆవిడ బలవంతం చేయ లేకపోయింది. కాని, అప్పుడే వెళ్ళనివ్వ లేదు రాజ్యలక్ష్మిని.

"నాకు ఉత్త మతిమరుపు. ఈ సామానంతా కారులోకి చేర్చేదాకా నువ్వుండాల్సిందే." ఏయే సామాను తనతో తీసుకువెడుతుందో అన్నీ ముందే చెప్పింది.

తెల్లవారుఝామున నాలుగు గంటలకు పిల్లఇంట్లో పెళ్ళి. చీకటిపడుతూంటే మగపెళ్ళివాళ్ళ వాహనాలు కదిలినా, వెంటనే ఇంటికి వెళ్ళిపోడానికి వీలు కాలేదు రాజ్యలక్ష్మికి. ఎక్కడ సామాను అక్కడ పడిఉందని, అవన్నీ పనివాళ్ళతో గదిలోకి చేరవేయించి తాళాలువేసి ఇంటిదగ్గర ఉంచిపోతున్న తన మేనత్తకు ఇచ్చిపొమ్మని చెప్పింది డాక్టరుగారి శ్రీమతి.

రాజ్యలక్ష్మి అలాగే చేసింది. బయల్దేరే సమయానికి రాత్రికి పది అయింది. పందిట్లోంచి వస్తుంటే పందిట్లో మంచంవేసుకు పడుకున్న ప్రవీణ్ ''ఎవరది?'' అన్నాడు.

"నేనండి!''

"నేనంటే?" ప్రవీణ్ లేచి కూర్చొని లైటువెలుగులో చూశాడు. "మీరా? ఇంత రాత్రిదాక ఇక్కడే ఉన్నారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అమ్మగారు వెడుతూ సామానంతా గదుల్లోకి సర్ది తాళాలు ముసలావిడకిమ్మని చెప్పారు. అంతా అయ్యేప్పటికి ఇంతరాత్రి అయింది."

"ఇంతరాత్రి మీరు వెళ్ళకపోతేనేం?"

"వెళ్ళాల్సిందే."

"అయితే ఉండండి." ప్రవీణ్ లోపలికి వెళ్ళి షర్ట్ తగిలించుకొని టార్చి తీసుకొని వచ్చాడు. "ఇంత రాత్రప్పుడు ఆడపిల్ల ఒంటరిగా ఎలా వెళ్ళగలనను కొన్నారు?"

"మీరెవరో తెలియందే నాతో ఎలా తీసుకువెడతా ననుకొన్నారు?" గడుసుగా అంది రాజ్యలక్ష్మి.

''డాక్టర్ ప్రవీణ్‌కుమార్. సన్ ఆఫ్ డాక్టర్ చంద్రశేఖర్. చాలా నా పరిచయం? ఇంకా కావాలా?" అతడి కంఠంలో ఏమూలో కాస్త కొంటెతనం చోటు చేసుకొంది.

''ఈ కాస్త పరిచయం ఈ పదిగంటల రాత్రివేళ నాతో మిమ్మల్ని తీసుకువెళ్ళ డానికి ఉపయోగిస్తుందంటారా?''

''ఓ!'' అతడికళ్ళలో ఏదో మెరుపు మెరిసింది. పెదవులు గంభీరంగా నవ్వాయి. ''నమ్మగలిగితే నన్ను మీతో మీ ఇంటిదాకా తోడుగా తీసుకువెళ్ళండి. లేకపోతే మీదారిన మీరు పొండి. నాదారిన నేను వస్తాను. నేనొక అమ్మాయిని అనుసరించకూడదని చెప్పే హక్కు మీకు లేదుగా? ఈప్రపంచంలో ఒకరి

స్వాతంత్ర్యాన్ని ఒకరు కాదనేందుకు వీలులేదు!"

రాజ్యలక్ష్మి తమాషాగా పెదవులు కదిలించి నవ్వింది. "బలేవారండీ బాబు! ఈ రాత్రివేళ ఒంటరిదైన ఆడపిల్లను వెంటాడేందుకు బలే ఛాన్స్ దొరికిందన్న మాట!"

"ఛాన్సంటారా? అయితే వదులుకోను. పదండి."

రాజ్యలక్ష్మితో ప్రవీణ్ కూడా కదిలాడు. రాజ్యలక్ష్మి ఇంటి అడ్రస్ అడిగి టాక్సీ పిలిచాడు.

"ఇక్కడే ఆపు."

టాక్సీ దిగి ప్రవీణ్‌కు థాంక్స్ చెప్పి ఇంట్లోకి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

ఆ శిథిలగృహంలాంటి పెంకుటిల్లు చూస్తూనే ఆమె ఎంత పేదజీవితం అనుభవిస్తూందో అర్థంచేసుకోగలిగాడు ప్రవీణ్.

*  *  *

డాక్టర్ చంద్రశేఖర్ మద్రాసు వెళ్ళాడు. రెండురోజులదాకా రాడు. రాజ్యలక్ష్మి కాస్సేపు కూర్చొని, వచ్చిన పేషంట్సుకి ఆ సంగతి చెప్పి వెళ్ళిపోదామనుకొనేంతలో ప్రవీణ్ వచ్చాడు.

"గుడ్‌మార్నింగ్!"

"గుడ్‌మార్నింగ్! మీరు..." అంది కుర్చీలో తిష్టవేసిన అతడిని చూసి.

"ఇంట్లో ఏంతోచక!"


రాజ్యలక్ష్మి అస్థిమితంగా చూసింది.

"మీ పేరు?"

"సిస్టరు అని పిలవండి. పేరుతో పనేమిటి?"

"సారీ! నేనిక్కడికి పేషంటుగా రాలేదు!" కొంచెం గంభీరంగా అన్నాడు ప్రవీణ్.

ఇక రెట్టించడానికి ధైర్యం చాల్లేదు రాజ్యలక్ష్మికి, అతడి ముఖం చూస్తూంటే. కళ్ళద్దాల వెనుక ఉజ్వలంగా ప్రకాశించే ఆకళ్ళు అంత శ్రద్ధగా తనను వీక్షించడం




చూశాక కలవరంగా చూపులు త్రిప్పుకోకుండా ఉండలేకపోయింది.

"మీరు మళ్ళీ వస్తారనుకొన్నాను!"

"రావాలనే అనుకొన్నాను. ఆ రోజు నా ఆరోగ్యం బాగుండక రాలేదు. ప్రతం రోజు తప్పకుండా రావాలని డాక్టరుగారు చెప్పారు కూడా... నేను వస్తానిక!"

"పేరు చెప్పరూ?"

"నా పేరుతో మీకు పనేమిటి?"

పని ఉన్నవాళ్ళకే మీ పేరు చెప్పుతారన్నమాట? ప్లీజ్! చెప్పండీ!"

"రాజ్యలక్ష్మి."

"చక్కటి పేరు!" తనలో తాను అనుకొంటున్నట్టుగా మృదువుగా ఉచ్చరించాడు. "రాజ్యలక్ష్మి!"

రాజ్యలక్ష్మి కళ్ళలో పులకింత రెపరెపలాడింది, ఒక్క క్షణం మాత్రమే. వెంటనే కఠినంగా మారిపోయింది ముఖం. "డాక్టరుగారు లేనిసమయంలో మీరిలా రావడం బాగాలేదు. నర్సుతో కల్పించుకొని మాట్లాడడం అసలు బాగాలేదు. దయచేసి మీ రిలాంటి పిచ్చి పని ఇంకెప్పుడూ చేయబోకండి. మరోసారి ఇలా జరిగితే..."

"జరిగితే?"

"డాక్టరుగారికి చెప్పవలసి వస్తుంది."

ప్రవీణ్ అదిరిపడ్డట్టు అభినయిస్తూ కుర్చీలోంచి లేచాడు. "అంత శ్రమ మీకివ్వనుగాని సాయంత్రం ఓసారి నౌబత్ పహాడ్‌మీదికి వస్తారా? మీకాక చిత్రమైన సంగతి చెప్పాలి నేను!"

"ఏమిటనుకొంటున్నారు నా గురించి? నాకలాంటి విహారాలు అలవాటు లేదు. నన్ను మీ రావిధంగా జమకట్టుకోవడం నా దురదృష్టం!" రాజ్యలక్ష్మికి ఆవేశంతోపాటు దుఃఖంకూడా వచ్చేసింది.

చలించాడు ప్రవీణ్. తనెంత దుష్టుడైపోయాడు! "క్షమించు, రాజ్యలక్ష్మీ! నీ మనసుకు ఇలా కష్టం కలిగిస్తాననుకోలేదు. నన్నింత తేలికగా జమకట్టుకోవడం కూడా నా దురదృష్టం! కాని, కాని... ఒకసారి నువ్వక్కడికి వస్తే... రాగలిగితే కృతజ్ఞుణ్ణి. నువ్వసహ్యించుకొనేదేమీ జరుగదక్కడ. ఎనిమిది గంటల దాకా ఎదురు చూస్తాను నీకోసం. రాకపోతే... మళ్ళీ నిన్నెప్పుడూ ఇలా కదిలించను!" అనేసి వెళ్ళిపోయాడు.

ఏమిటితడి మనస్తత్వం? ఏం చెబుతాడు తనతో? నువ్వు నాకు నచ్చావు. నిన్ను ప్రేమిస్తున్నాననా?ఎవరినీఅక్కరలేదన్న అతడికి తనలోఏం ప్రత్యేకత కనిపించిందని ప్రేమిస్తాడు? పెద్ద అందగత్తె కాదు. ధనవంతుల గారాల కూతురు కాదు. చదువుకొన్నదికాదు. మగవాళ్ళను ఆకర్షించుకోగల తళుకుబెళుకులూ లేవు.

తనలో ఏంచూసి ప్రేమిస్తాడు? ఏంచెబుతాడు తనను ఒంటరిగా కలుసుకొని?

చీకటిపడేవరకు అతడి కోరిక మన్నించాలనే ఆలోచన కలుగలేదు. రాజ్యలక్ష్మికి. కాని, నిముషాలు దొర్లి పోతున్నకొద్దీ, "ఎనిమిది గంటలదాకా ఎదురుచూస్తాను! రాకపోతే... మళ్ళీ నిన్నెప్పుడూ..." బరువుగా, జాలిగా అతడికంఠమే మనసులో ప్రతిధ్వనిస్తున్నట్టుగా వినిపిస్తుంటే ఆగలేక పోయింది.

ఒక గంటలో తిరిగి వచ్చేస్తానని ఇంట్లో చెప్పి బయల్దేరింది రాజ్యలక్ష్మి.

చివరిక్షణం నిరీక్షణలో ఉన్న ప్రవీణ్ వదనం రాజ్యలక్ష్మి ఆగమనానికి ఆనంద ప్రపుల్లమైపోయింది.

"ఏ ఊహలూలేని నన్ను మీరెందుకిలా కదిలిస్తున్నారు? ఏమిటి మీ ఉద్దేశ్యం?"

"ఆ ప్రశ్నే నేను వేయాలనుకొంటున్నాను, రాజ్యలక్ష్మి!"

"చూడండి, సార్! ఈ భావుకత్వం మావంటి పేదవాళ్ళకు పడదు. చెప్పేదేదో సూటిగా చెప్పండి! ఏమిటి మీ ఉద్దేశ్యం?"

"ఇదేమిటో నాకు తెలిస్తేగా సూటిగా నీకు చెప్పడం? ఇదేమిటో నాకు అర్థం కావడంలేదు. ఒక స్త్రీ గురించి మధురూహలు నన్ను చుట్టివేయడం, నా మనసు నాది కాకుండాపోవడం, ఆమె సాహచర్యం కోసం హృదయం అలమటించడం, ఈ అనుభూతిని ఆమెతో పంచుకోవాలని కోరుకోవడం, ఇదంతా నాకు క్రొత్త! ఏదో అలజడి! ఎందుకో నిరీక్షణ!"

"ఇది కలవారికి సామాన్యంగా కలిగే పైత్యమనుకొంటాను! రేపు డాక్టరుగారు వచ్చాక ఆయనతో చెబుతాను! మందు ఇస్తారు, ఘాటయిన మందు!"

"నా అవస్థ నీకు తమాషాగా, కోపం కలిగిస్తున్నట్టుగా ఉంది! కాని, కాని... నన్నర్థంచేసుకొనడానికి ప్రయత్నించమని వేడుకొంటున్నాను. నిన్ను మోసం చేయడంలేదు. మభ్యపరచడంలేదు. నా ఆరాధనను విన్నవించుకొంటున్నాను."

"ఎలా నమ్మమంటారు మీమాట? వయసుతప్ప నా దగ్గర ప్రత్యేకతేదీ లేదు.మిమ్మల్ని ఆకర్షించగలిగినది నాలో ఏముందని?"

"నిర్మలమైన ఆ కళ్ళలో జన్మజన్మల అనుబంధమేదో కనిపించి ఉండాలి. లేకపోతే, చూడగానే ఎక్కడో తప్పిపోయిన నా స్నేహామయిని చూసినట్టు, నా క్కావలసిన మనిషి ఈమే అన్నట్టు ఎందుకనిపిస్తుంది."

చిటపటలు చిందులు మానేసి వర్షర్తువు నదిలా గాంభీర్యాన్ని, శాంతాన్ని వహించింది రాజ్యలక్ష్మి.

"ఆరాత్రి నన్ను అనుసరించే హక్కు మీకెలా ఉందన్నారో, అలాగే నన్ను ప్రేమించే హక్కు మీకుందనవచ్చు! కాని, నా పరిస్థితులు మీకేమీ తెలియవు! మా నాన్న పోయారు. మానాన్నతో ఉన్న స్నేహం మూలంగా నాకీ ఉద్యోగం యిచ్చారు మీనాన్నగారు! ఇప్పుడు మా కుటుంబం నామీదే ఆధారపడివుంది. ఈ పరిస్థితిలో మీ ప్రేమను గురించి ఆలోచించే స్వతంత్రం నాకు లేదు."

"మీ అమ్మగారున్నారా?"

"ఉంటే?"

"ఆవిణ్ణే అడుగుతాను!"

"ఏమని?"

"నిన్ను చూసిన ప్రథమ వీక్షణంలో నా క్కలిగిన అనుభూతి ఏం కావాలని కోరుకుంటుందో అది!"

రాజ్యలక్ష్మి కూర్చున్నదల్లా లేచింది. "అది చాలా అసంభవమైన సంగతి! దయచేసి ఈ విషయం మరిచిపోవాలని కోరుతున్నాను. నేను పెళ్ళి చేసుకోను. ఎవరినీ చేసుకోను! చేసుకోలేను!"

"ఎందుకు? మీ కుటుంబం నిరాధారమౌతుందనేనా? అందుకు మార్గం ఏర్పడ్డాకే మన పెళ్ళి జరుగుతుంది!"

"మీ విశాలహృదయానికి నా ధన్యవాదాలు! కాని, అదే ముఖ్య కారణం కాదు."

"మా నాన్నగారు ఏమైనా అంటారని భయమా?"

"మీకే లేని భయం నా కెందుకుటుంది?"

"అయితే ఇంకేమిటి?"

"చెప్పలేను. నా బ్రతుక్కి భగవంతుడు పెట్టిన శాపంగురించి ఎవరికి ఏమని చెబుతాను? చెప్పలేను. చెప్పను. నాలో ప్రతిక్షణం జ్వలించే ఈ అగ్ని నాతోనే ఆరిపోవాలి!" ఆగకుండా వడివడిగా నడిచింది రాజ్యలక్ష్మి.

ఆ తరువాత రెండు మూడుసార్లు ఆమెను కలుసుకొని మాట్లాడాలని ప్రయత్నించాడు ప్రవీణ్.

రాజ్యలక్ష్మి అతడికి ఆ అవకాశం ఇవ్వకుండా తప్పించుకొంది.

* * *

చంద్రశేఖర్ కొడుకును గదిలోకి పిలిచి ఓ చీటీ అతడిమీదికి విసిరాడు. "ప్రవీ! మీరు స్వతంత్రులు అయ్యారు! కాదనను. కానీ, తండ్రి పరువుప్రతిష్ఠలు కాపాడవలసిన బాధ్యత మీమీద ఉన్నదని మరువడం మాత్రం భావ్యంకాదు!"

తనమీదికి విసిరిన చీటీ చదువుకొన్నాడు ప్రవీణ్.

"డాక్టర్ చంద్రశేఖర్‌గారికి,

మీ పెద్దబ్బాయి ప్రవీణ్‌కుమార్ మీ నర్సు రాజ్యలక్ష్మితో ప్రేమవిహారాలు పరాకాష్ఠ నందుకొన్నాయి! వ్యవహారం చేయిదాటకముందే జాగ్రత్తపడండి.

ఇట్లు.

మీ శ్రేయోభిలాషి!"

ప్రవీణ్ తండ్రిముఖంలోకి నిశ్చలంగా చూశాడు. రాజ్యలక్ష్మిని నేను పెళ్ళి

చేసుకోవడంవల్ల మీ పరువు ప్రతిష్ఠలకు హాని జరుగుతుందంటారా?"

"ముమ్మాటికీ!''

"ఆమె మీ స్నేహితుడి కూతురు! వాళ్ళ కుటుంబమన్నా, రాజ్యలక్ష్మి అన్నా మీ కెంతో అభిమానమని విన్నాను. అలాంటప్పుడు ఆమె కోడలు కావటం మీరు హర్షిస్తారనే అనుకొన్నాను!"

"హర్షించేవాడినే. కానీ, ఆమె నా కోడలు కాదగిన అర్హతలేదు!"

"అర్హత అంటే? చదువు, సంపద లేనా?"

"ఇలాంటివాటిలో నీతో నేను పాఠం చెప్పించుకొనే హీనస్థితిలో లేను, ప్రవీణ్! మీకంటే కూడా విశాలంగా ఆలోచించే వాడిని! ఆ విషయం మరువకు!"

"మరి?"

"ఆ పిల్ల కారెక్టర్ మంచిదికాదు!"

"డాడీ!"

"నిజం! రూఢిగా తెలుసు నాకు!"


చంద్రశేఖర్ ఆశించినట్టుగా ప్రవీణ్‌లో విరక్తిలాంటిది కలుగలేదు. రాజ్యలక్ష్మి అంటే ఇంకా జిజ్ఞాస పెరిగింది. ఆ పిల్ల ఎందువల్ల తన కారెక్టర్ చెడగొట్టుకొంది? పేదరికంవల్లా? వయసు ప్రలోభంవల్లా? తను తెలుసుకోవాలి! ఆ పిల్ల జీవితంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి! అప్పుడే తన ప్రేమ పవిత్రమైనది! అప్పుడే తను నిజమైన మనిషి!

మరొకనాడు తండ్రి ఊరికి వెళ్ళిన సమయంలో డిస్పెన్సరీకి వచ్చాడు.

కోర్సు తీసుకొంటున్న వాళ్ళకి ఇంజక్షను ఇస్తున్నది రాజ్యలక్ష్మి. ఆమె పని ముగించుకువచ్చేవరకు ఆమెకోసం వేచి కూర్చొన్నాడు ప్రవీణ్. కన్సల్టింగ్ రూంలో-ఓ మాగజైను త్రిప్పివేస్తూ

రాజ్యలక్ష్మి మౌనంగా సామాను అల్మెరాలో పెట్టి తాళంవేసి వెళ్ళబోయింది

"రాజ్యలక్ష్మి?"




"నన్నెందు కిలా వెంబడించి వేధిస్తారు?"

"నువ్వెందు కిలా పారిపోతున్నావ్?"

"పాపం మనిషిని తరుముతుంది."

"పాపం చేయని మనిషెవరు?" నిర్మలంగా నవ్వాడు ప్రవీణ్. "డబ్బు ఉండీ కొందరిచేత పాపం చేయిస్తుంది. డబ్బు లేకా కొందరిచేత పాపం చేయిస్తుంది. ఎదుటిమనిషి పాపాన్ని క్షమించడంలోనే ఇవతలిమనిషి ఔన్నత్యం నిలుస్తుంది!''

''మీరు క్షమించినంత మాత్రాన నా పాపం పరిహారమై నేను పవిత్రురాలిని కాను! ప్రేమ మిమ్మల్ని గ్రుడ్డివారిని చేసింది. నా కొండంత పాపం మీకు పువ్వులరాసిగా కనిపించవచ్చు! కాని, నన్ను నేను ఎలా వంచించుకోగలను? మనసారా ఆరాధించే ఒక పురుషుడి జీవితంలో పవిత్రంగా పడవలసిన ఈ అడుగు...ఎప్పుడో అపవిత్రమైపోయిన ఈ అడుగు ఎలా వేయగలను?"

"మరచిపో, రాజ్యలక్ష్మి! గతం మరిచిపో. ఏ కారణంచేత నువ్వు తప్పటడుగు వేసినా నేను నిన్ను స్వీకరించడానికి సిద్ధపడుతున్నప్పుడు ఇంకా నిన్ను నీవు శిక్షించుకోవాలనుకోవడం అర్థంలేని పని!''

"మరిచిపొమ్మంటారా?" విరక్తిగా, నిరసనగా నవ్వింది. "ఆ వ్యక్తి...ఆ వ్యక్తి మీ తండ్రే అయినప్పుడు నే నెలా మరుస్తాను? ఎలా మరువగలను? మీ ప్రేమమాత్రం ఈ పరీక్షముందు ఎలా నిలబడుతుంది! ఇప్పుడు చెప్పండి సార్! నిన్నే పెళ్ళిచేసుకొంటానని! అహాహా అహాహా! ఏం మగవాళ్ళు! ఎంత విశాల హృదయం? ఉలకరు, పలకరు!'' పిచ్చిదానిలా నవ్వడం మొదలుపెట్టింది రాజ్యలక్ష్మి.

ప్రవీణ్ తల తిరిగిపోయింది. నిశ్చేష్టుడిలా మిగిలిపోయాడు.

* * *

"ప్రవీణ్ బాబూ!

ఈ ప్రపంచంలో దారిద్ర్యమంత చెడ్డది మరొకటి లేదేమో! కాకపోతే, నా స్థానం ఎందు కిలా దిగజారిపోయేది? నేను పతనమైనచోటే నే నెందుకిలా ఉన్నాను? నా శీలసంపదను కొల్లగొట్టిన వ్యక్తి చేతితిండి నేనింకా ఎలా తినగలుగుతున్నాను? వీటన్నిటికీ జవాబు మా దరిద్రం!

మీ నాన్న, మా నాన్న చిన్ననాటి స్నేహితులు. మానాన్న రిటైర్డ్ టీచరు.

గంపెడు సంతానం! అందరిలోకి జేష్ఠురాలిని!

ఒకనాడు మీ నాన్నగారినికలుసుకొని, "బ్రతుకుబాటలో అలిసిపోయాను, చంద్రశేఖర్! ఏదైనా చిన్న ఆసరా కోసం నా ప్రాణం తహతహలాడి పోతున్నది. కానీ, ఎంత ఆలోచించినా ఏ ఆధారమూ కనిపించడం లేదు!" అన్నారు మా నాన్న.

అందుకాయన విశాలహృదయంతో "మీ పెద్దమ్మాయిని నా దగ్గర నర్సుగా ఉంచుకొంటాను!" అన్నారు. నన్ను నర్సును చేయడానికి నాన్నగారు ఇష్ట పడలేదు. డాక్టరుగారి బలవంతంమీద 'అమ్మాయి అభిప్రాయం కనుక్కొంటాను!' అన్నారు.

"ఇష్టపడితే మాత్రం నువ్వా పిల్ల ముందడుగుకు ఎదురు నిలవకు! ఆ పిల్ల తన అదృష్టాన్ని వెతుక్కునే అవకాశ మివ్వు. నువ్వా అదృష్టాన్ని వెతికి చేతిలో పెట్టకపోయినా వాళ్ళ అదృష్టం వాళ్ళు వెదుక్కొంటూ వెళ్ళిపోతుంటే అడ్డుపెట్టకపోవడం తండ్రిగా నీ కనీస ధర్మం!"

మా నాన్నగారు ఈ సంగతి చెప్పి నా అభిప్రాయం అడిగారు. నాకూ ఆ క్షణంలో అలానే అనిపించింది. అదృష్టం కోసం మనం వేచిచూడడంకాక ఆ అదృష్టంని వెదుకుతూ బయల్దేరడమే మంచిది! కాని, నాకు అందినది అదృష్టం కాదు. దురదృష్టం!

రెండేళ్ళ తరువాత ఒకనాడు-

ప్రొద్దుటినుండి ఒకటే వర్షం పడుతోంది.

సాయంత్రం పేషంట్సు ఎవరూ రాలేదు. డాక్టరుగారూ నేనూ మిగిలి పోయాం. ఇంటికి వెళ్ళిపోదామంటే ఒకటే వర్షం! కిటికీ దగ్గర నిలబడి కాంపౌండ్ గోడమీదుగా రోడ్డువైపు చూస్తున్నాను.

"ఇంటి కెలా వెడతావు రాజ్యం?" వెనకనుండి డాక్టరుగారు అడిగారు.

"అదే చూస్తున్నాను, డాక్టర్! రోడ్డు మీద ఒక్క వాహనంకూడా లేదు!"

మరి కాస్సేపు మాట్లాడలేదు డాక్టరు.

వర్షం ఉధృతమైంది. కిటికీలోంచి జల్లు పడుతూంటే కిటికీ మూసివేశాను. ఈలోగా గదితలుపు లెప్పుడు మూసు కొన్నాయో నేను చూడలేదు.

వేడిగా రెండు చేతులు నా భుజాల మీద పడ్డాయి.

ఆ తరువాత జరిగినదాన్ని నే నిక వర్ణించను. ఆయన్ని ఎదిరిస్తే మా కుటుంబం పొందబోయే దుర్గతి కళ్ళ ముందు కదిలి నన్ను ఆయన చేతుల్లో బందీని చేశాయి! నిన్న మొన్నటిదాకా తండ్రిలా ఆదరించిన మనిషి ఎందుకిలా హఠాత్తుగా దుర్మార్గుడైపోయాడో నాకు తెలియదు!

జరుగవలసిన దారుణం జరిగి పోయింది—

మీ నాన్నగారు శాంతచిత్తులై నా గురించి చాలా బాధపడ్డారు. క్షమించమని వేడుకొన్నారు. వరుణ్ణి వెదికి పెళ్ళి చేసు కొనేట్టయితే తను డబ్బివ్వగలనని మహా ఉదారులై ప్రకటించారు.

కాని, ఈ మలిన శరీరంతో ఏ పురుషుడి జీవితంలో అడుగు పెట్టగలను? అందుకు అర్హత మీ నాన్నగారి క్షణి కావేశం తుడిచివేసింది. ఈ జీవితానికిక ఆ అదృష్టంలేదు, ప్రవీణ్ బాబూ! లేదు!"

ఈ చీటీ ఎలాగో ప్రవీణ్‌కు అందేలా చేయగలిగింది రాజ్యలక్ష్మి.

అందుకు జవాబుకూడా ప్రవీణ్ నుండి వచ్చింది.

"రాజ్యలక్ష్మీ!

నేను మన బాంధవ్యాన్ని గౌరవిస్తు న్నాను. గౌరవించకపోతే జంతువుకూ నాకూ భేదముండదేమో? నువ్వు మరొకరివల్ల చెడిపోయివుంటే నేను తప్పక స్వీకరించగలిగేవాడిని! కాని, ఆ వ్యక్తి నా తండ్రే కావడంవల్ల నువ్వు నాకు అమ్మవరుస అవుతావు!

రాజ్యలక్ష్మీ! నువ్వు నాకు ఈ క్షణం వరకు ప్రియమైన వ్యక్తివైనా నీ జీవితంలో పలికిన అపశ్రుతి సరిచేయడానికి అసమర్థుడిని అయ్యాను. మరేయువకుడి వల్లైనా నువ్వు వివాహితవుకాగల అవకాశమే వస్తే నిరర్థకంగా నీ గాథంతా చెప్పి అతడిముందు దోషిగా నిలబడకు. దురదృష్టవశాత్తూ జరిగిపోయిన ఒక పొరపాటుకు జీవితమే బలిపెట్టడం అంత వివేకమైన పనికాదు. గతానికి నీ హృదయంలోనే సమాధి కట్టివేసి ఆనందమయమైన జీవితాన్నికల్పించుకో. ఇదే నా కోరిక. ఇదే నా ఆశీస్సు —

ప్రవీణ్."

పదిరోజుల తరువాత ప్రవీణ్ ఫారిన్‌కు ప్రయాణమై వెళ్ళిపోయాడని తెలిసింది రాజ్యలక్ష్మికి.

